
సాక్షి ఒడిశా

బుధవారం । 29 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,82,778
బంగారం	1 గ్రాము 930 మిల్లీ గ్రాములు
వెండి	28 గ్రాముల 650 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



విజిలెన్స్ వలలో పోలీసు అధికారి

జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ పోలీసు అధికారి సుశాంత్ కుమార్ శతపతి విజిలెన్స్ అధికారులకు చిక్కారు.

- 8లో




జిహ్వా చాపల్యం

కార్తీక మాసం పూర్తవ్వడంతో మంగళవారం నాన్‌వెజ్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

- 8లో

న్యూస్‌రీల్

లేజర్ స్కానింగ్ ప్రారంభం



భువనేశ్వర్: శ్రీ మందిరం రత్న భాండాగారం లేజర్ స్కానింగ్ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు శ్రీమందిరం అధికారులు భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ)కి అనుమతి ఇచ్చారు. శ్రీమందిరం ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఏఓ) ఈ సమాచారం ఇచ్చారు. కార్తీక పూర్ణిమ ముగియడంతో లేజర్ స్కానింగ్ ప్రక్రియ షెడ్యూల్ ఖరారైనట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏఎస్‌ఐ బృందం తమకు అనుకూలంగా లేజర్‌ను స్కాన్ చేపడుతుందని శ్రీమందిరం చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రంజన్ కుమార్ దాస్ తెలిపారు. రత్న భాండాగారంతో పాటు ప్రధాన ఆలయ ప్రాంగణంలో ఇతర కట్టడాలు స్కాన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అయితే లేజర్ స్కానింగ్ నివేదికను సాంకేతిక నిపుణుల కమిటీ పరిశీలించిన చేసిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

15 మంది సభ్యుల బృందం

లేజర్ స్కానింగ్ కోసం ఏఎస్‌ఐ బృందం పూరీ ఆలయానికి చేరుకుంది. ఏఎస్‌ఐ సూపరింటెండెంట్ డి.బి.గొడొనాయక్ నేతృత్వంలో 15 మందితో కూడిన బృందం రత్న భాండాగారం లేజర్ స్కానింగ్ ప్రక్రియలో పాల్గొంటుంది. ఈ బృందంలో ఫొటోగ్రఫీ సభ్యులు కూడా ఉన్నారు. ముందుగా రత్న భాండాగారం వెలుపలి వైపు స్కాన్ చేసి, ఆపై ప్రధాన ఆలయం మరియు ఇతర ఉప ఆలయాలు స్కాన్ చేస్తారని గొడొనాయక్ వివరించారు.

నేడు శ్రీముఖ అలంకరణ

భువనేశ్వర్: శ్రీమందిరం రత్న వేదికపై కొలువు దీరిన బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీజగన్నాథ స్వామి మూల విరాటుల శ్రీముఖ అలంకరణ బుధవారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు, యాత్రికులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు శ్రీ మందిరం ఆలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఆలయ అధికార వర్గాల సమాచారం ప్రకారం మార్గశిర కృష్ణ పక్ష ద్వితీయ తిథి పురస్కరించుకుని బుధవారం శ్రీముఖ అలంకరణ సేవ నిర్వహించనున్నారు. ఈ సేవ గోప్యంగా నిర్వహిస్తారు. ద్వితీయ భోగ మండపం సేవ అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అలంకరణ నిరవధికంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో సుమారు 4 గంటలపాటు భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తారు. అలంకరణ పూర్తయ్యాక దర్శనానికి యథాతథంగా అనుమతిస్తారు.

జైలులో మహిళా ఖైదీ మృతి

భువనేశ్వర్: స్థానిక ఝరపడా జైలులో మహిళా ఖైదీ మృతి చెందింది. ఆమెను సుకాంతి భొయ్‌గా గుర్తించారు. లక్ష్మీసాగర్ ఠాణా పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, శవ పరీక్ష నిమిత్తం క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. వధువు హత్య కేసులో సుకాంతి భొయ్ నిందితురాలు. ఈ నేపథ్యంలో విచారణ కొనసాగుతోంది. అనారోగ్యంతో ఆమె కారాగారంలో మరణించినట్లు సమాచారం.

చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరిక

భువనేశ్వర్: దక్షిణ అండమాన్ సముద్రానికి ఆనుకుని ఉన్న మలక్కా జలసంధిలో అల్పపీడనం ఏర్పడినందున డిసెంబర్ 1 నుంచి మధ్య బంగాళాఖాతంలోని లోతైన సముద్ర ప్రాంతాలకు వేటకు వెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు సూచించింది. బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా మరియు గంజాం వంటి తీరప్రాంత జిల్లాల కలెక్టర్లకు రాసిన లేఖలో ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ) అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం దక్షిణ అండమాన్ సముద్రానికి ఆనుకుని ఉన్న మలక్కా జలసంధిపై అల్పపీడనం పశ్చిమ దిశగా దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా కదులుతుంది. ఈనెల 30 నాటికి పశ్చిమ, వాయువ్య దిశగా కదిలి, ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది వాయువ్య దిశగా పయనించి తదుపరి 48 గంటల్లో నైరుతి, ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో తుఫాన్‌గా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో డిసెంబర్ 1 నుంచి నైరుతి బంగాళాఖాతంకి ఆనుకుని మధ్య బంగాళాఖాతంపై గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో వీచే గాలులు 60 కి.మీ వేగంతో బలం పుంజుకునే అవకాశం ఉంది. డిసెంబర్ 2న గంటకు 50 నుండి 60 కి.మీ గాలుల వేగం గంటకు 70 కి.మీ వేగంతో బలం పుంజుకునే అవకాశం ఉన్నందున ఈ సమయంలో సముద్రం చాలా అల్లకల్లోలంగా ఉంటుందని మత్స్యకారులకు హెచ్చరించింది.



మేళాలో ప్రదర్శిస్తున్న పవర్ టిల్లర్లు, మినీ ట్రాక్టర్లు



వ్యవసాయ యంత్రాల మేళా ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర సాహు

యంత్రముగ్ధం

స్థానిక గజపతి స్టేడియంలో జిల్లా స్థాయి వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల మేళాను ఎంపీ చంద్రశేఖర సాహు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలియజేశారు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను 50 శాతం రాయితీతో అందజేస్తున్నారని, దీనిని రైతులు, బీపీఎల్ లబ్ధిదారులు, మిషన్ శక్తి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒడిశాలోని పథకాలనే ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలియజేశారు. అనంతరం వ్యవసాయ పనిముట్లు ద్వారా లబ్ధిపొందిన రైతులు, మహిళలను సన్మానించారు. మేళాలో మొత్తం 54 స్టాల్స్ ఏర్పాటు చేశారు. వాటిలో వ్యవసాయ పనిముట్లు, ఉద్యానవనాలు, చేపల చెరువుల పెంపకం కీటక నాశినుల మందుల షాపులు ఉన్నాయి. పనిముట్ల కొనుగోలుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఎస్‌డీసీ చైర్మన్ మరియం రైతో, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి తదితరులు పాల్గొన్నారు. – పర్లాకిమిడి



చేపల చెరువుల ఏర్పాటుకు సంబంధించిన స్టాల్



గిరిజన సాంప్రదాయ సవర నృత్యం ప్రదర్శన



సబ్సిడీలతో గిరిజనులకు మినీ ట్రాక్టర్లు, పిండి మిల్లులు అందజేత



రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం



వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల స్టాల్

రాష్ట్రంలో బీజేడీకి మరింత ఆదరణ



పార్టీలో చేరినవారితో మంత్రి సరక, గొమాంగో తదితరులు

• మంత్రి జగన్నాథ సరక

రాయగడ: రాష్ట్రంలో బీజేడీకి ప్రజల ఆదరణ మరింత పెరుగుతోందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని రామనగుడ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన మిశ్రణ పర్వ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సమితి పరిధిలోని 15 గ్రామాలకు చెందిన 300 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీజేడీలో చేరారు. వారికి మంత్రి సరక పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేడీ విజయానికి అంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మరోసారి బీజేడీదే అధికారమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, సీనియర్ నాయకుడు గగన్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

ఆవుపై పులిదాడి

పర్లాకిమిడి: గజపతి జిల్లా నువాగడ బ్లాక్ అనుగురు పంచాయతీ ఓవామా గ్రామంలోకి పెద్దపులి ప్రవేశించి సోమవారం ఒక ఆవును చంపి తినట్లు అటవీ శాఖ ఏసీఎఫ్ అశోక్ కుమార్ బెహరా తెలియజేశారు. ఓవామాలో పులి పాదముద్రలు, మృతి చెందిన ఆవు అవశేషాలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి ప్రస్తుతం గుణుపూర్ సబ్ డివిజన్ గుడారి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు వెల్లడించారు. దీంతో గుడారి, కెందుగుడ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి రాయగడ జిల్లాకు తిరిగి వెళుతున్నట్లు అటవీ అధికారుల సమాచారం.



గుడారి ప్రాంతంలో పాదముద్రలు గుర్తిస్తున్న అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు

కుటుంబ కలహాలతో మహిళ హత్య..?





శున జాని ఇంటివద్ద గుమిగూడిన స్థానికులు, (ఇన్‌సెట్లో) శున జాని మృతదేహం

జయపురం: కుటుంబ కలహాలతో ఒక మహిళను హత్య చేసిన ఘటన జయపురం డివిజన్ బొయిపరిగుడ సమితి కొలార్ గ్రామ పంచాయతీ ముదులిగుడ గ్రామంలో చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముదులిగుడ గ్రామంలో సిరమ జాని(35) తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. శనివారం రాత్రి సిరమ, అతడి భార్య శున జాని(30) లు ఏదో కారణంతో గొడవపడ్డారు. కాగా ఆదివారం ఉదయం నాటికి శున జాని మృతిచెంది ఉండడం సంచలనం సృష్టించింది. దీంతో ఈ విషయాన్ని సిరమ కుటుంబ సభ్యులు కొలవజొడ గ్రామంలో నివసిస్తున్న శున జాని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో వారు వచ్చి సిరమ జానీ ఇంటిలో లేకపోవడంతో ఎలా మరణించిందో తెలియజేయాలని సిరమ తండ్రి, తమ్ముడులను అడిగారు. శున మెడ, శరీరంపై గాయాలు ఉండడంతో హత్య చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టంకి పంపారు. ఫిర్యాదు మేరకు సిరమతో పాటు అతడి తండ్రి కుములు జాని, సోదరుడు బెంగు జానిలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరణించిన శున జానికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. దీంతో పిల్లలు అనాథలుగా మారారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమష్టి కృషితో విజయం తథ్యం

• బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి
• కార్యకర్తల శిక్షణ శిబిరం ప్రారంభం

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సమష్టిగా కృషి చేస్తే బీజేడీ విజయం తథ్యమని బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. స్థానిక బిజూ పట్నాయక్ అడిటోరియంలో రెండు రోజుల కార్యకర్తల శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈసారి జరగనున్న ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవన్నారు. వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అంతా కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీ విజయానికి ప్రతీకగా నిలిచే కార్యకర్తలు అంతర్గత విభేదాలను వీడాలని కోరారు. రాయగడ శాసనసభ నియోజకవర్గంతో పాటు బిసంకటక్, గుణుపూర్ అదేవిధంగా కొరాపుట్ లోక్‌సభస్థానాన్ని కైవసం చేసుకునేందుకు సన్నద్ధం కావాలన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆశీర్వాదంతో 5టీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వీకే పాండ్యన్ బీజేడీలో చేరడం పార్టీకి మరింత బలమన్నారు. ఆయన సలహాలు, సూచనల మేరకు పనిచేయాలని సూచించారు.



వేదికపై నెక్కంటి, అనసూయ మాఝి, లాల్ బిహారి హిమిరిక, రాయ్ తదితరులు

సంక్షేమ పథకాలతో మేలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతోందని నెక్కంటి అన్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రంలో బీజేడీ అధికార పగ్గాలు చేపడుతుందంటే అందుకు కారణం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలేనని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం మరోసారి బీజేడీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో ప్రతీ కార్యకర్త సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయగడ నియోజకవర్గంలో ఈసారి ఎలాగైనా పార్టీ జెండా ఎగరవేసేందుకు కృషి చేయాలన్నారు.

ప్రతీ కార్యకర్త పాల్గొనాలి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ప్రతీ కార్యకర్త పాల్గొనాలని రాయగడ శాసనసభ నియోజకర్గం ఎన్నికల పరిశీలకునిగా వచ్చిన రంజిత్ రాయ్ పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త తమ పరిధిలోని 60 మందితో ప్రతిరోజూ కలిసి, అవగాహన కల్పించాలని సూచించారు. తమ వ్యక్తిగత పనులు ముగించుకున్న అనంతరం ప్రతీ కార్యకర్త ఇదే దైనందిన కార్యక్రమంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న కార్యకర్తలు

హాజరైన ఎమ్మెల్యే ముదులి

బీజేడీ కార్యకర్తల శిక్షణ శిబిరంలో రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గత ఎన్నికల్లో విజయం సాధించిన మకరంద ముదులి పాల్గొన్నారు. గత కొద్ది నెలలుగా ఆయన అధికార పార్టీ నిర్వహిస్తున్న ప్రతీ కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో ఆయన బీజేడీ తీర్థం పుచ్చుకున్నారా.. లేక వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ టిక్కెట్టు ఆశిస్తున్నారో తెలియడం లేదు.

జిల్లా అధ్యక్షుడు గైర్హాజరు

కాగా ఈ సమావేశానికి బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుదీర్ దాస్ గైర్హాజరయ్యారు. పార్టీలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న దాస్ గైర్హాజరుపై కొంతమంది కార్యకర్తలు రుసరుసలాడుకోవడం వినిపించింది.



పేర్లు నమోదు చేసుకుంటున్న కార్యకర్తలు

పార్టీలో అంతర్గత విభేదాలకు తెరపడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఆయన గైర్హాజరుపై అధికారంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. శిబిరంలో ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, మాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక, రాయగడ మున్సిపల్ వైస్ చైర్మన్ శుభ్ర పండ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోర్సండలో గ్రీవెన్స్ సెల్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: గుసాని బ్లాక్ కోర్సండలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ పాల్గొన్న కార్యక్రమానికి మొత్తం 106 వినతులు వచ్చాయి. వాటిలో అభియోగాలు 38, గ్రామ సమస్యలు 68 ఉన్నాయి. వాటిలో 43 వినతులు అక్కడికక్కడే పరిష్కరించబడ్డాయి. సీఎం సహాయనిధి నుంచి ఇద్దరు వ్యక్తులకు రూ.10 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, బీడీవో అజయ్‌కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాం సుందర్ పాత్రోకు రెండేళ్ల జైలుశిక్ష

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి పౌర సరఫరాల శాఖలో పనిచేసిన విశ్రాంత ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.శ్యాం సుందర్ పాత్రోకు బరంపురం విజిలెన్స్ ప్రత్యేక జడ్జి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల అపరాధ రుసుము విధిస్తూ తీర్పునిచ్చారు. 2013లో పాత్రో లంచం తీసుకుంటుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఆయన ప్రభుత్వ విధులు నుంచి సస్పెండ్ అయ్యారు. బరంపురం విజిలెన్స్ కోర్టులో ఈ కేసు ఎనిమిదేళ్లు నడిచింది. అనంతరం బుధవారం కేసు తీర్పును వెల్లడించారు. రూ.10 వేల అపరాధ రుసుము కట్టకపోతే మరో నెలరోజుల పాటు జైలు శిక్ష అదనంగా ఉంటుందన్నారు. ఆయనకు ప్రభుత్వం మంజూరు చేయనున్న పెన్షన్ సైతం నిలిపివేయాల్సిందిగా సంబంధిత శాఖకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

పొందూరులో పిచ్చికుక్క స్వైర విహారం



చికిత్స పొందుతున్న బాధితుడు

పొందూరు: పొందూరులో మంగళవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారిపై దాడి చేసి కరిచింది. దాదాపు 20 మందికిపైగా గాయాలపాలయ్యారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి వాండ్రంగి జంక్షన్, స్టేట్ బ్యాంకు, కేవీఆర్ థియేటర్, అఫీషియల్ కాలనీలో 20 మందిని గాయపరిచింది. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఓ ఉద్యోగిని కరిచి అక్కడి నుంచి బస్టాండ్‌కు వెళ్లి మరికొంత మందిని కరిచింది. వీరంతా ప్రైవేటు ఆస్పత్రుల్లోను, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. పిచ్చికుక్కను వెంబడించి హతమార్చారు.

గుండె సమస్యలపై 108 సిబ్బందికి శిక్షణ



శిక్షణ పొందిన 108 ఈఎంటీలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా జిల్లా ఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, పలాస ఓఈ జగన్ పర్యవేక్షణలో ఓజేటీ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో హఠాత్తుగా గుండె ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు వాటి ని వారణ చర్యలు, అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేసే విధానం, ఈసిజి, ఎసిఎల్ఎస్ ఎయిర్ వే మేనేజ్‌మెంట్, 108 అంబు లెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాలు వంటి విషయాలపై శిక్షణ, సమీక్ష త రగతులు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజ న్ పరిధిలో పనిచేస్తున్న వారు పాల్గొన్నారు.

అడవి జంతువు దాడిలో ఆవు దూడ మృతి



స్థానిక రైతులతో మాట్లాడుతున్న అటవీ శాఖ సిబ్బంది


సోంపేట: మామిడి పల్లి పంచాయతీ చిన మామిడిపల్లి గ్రామానికి చెందిన తోట నారాయణరావు ఆవు దూడపై సోమవారం రాత్రి గుర్తుతెలియని అడవి జంతువు దాడి చేయడంతో దూడ మృతి చెందింది. దీంతో అటవీ శాఖ సిబ్బంది రాజేంద్ర, సంతోష్ సంఘటన స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. అడవి జంతువుల బారి నుంచి రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



పొరజ ఆదివాసీ సాంప్రదాయ నృత్య ప్రదర్శన



ఆదివాసీల జీవనాన్ని తెలిపే నాటకం ప్రదర్శన



ఆదివాసీలతో డాన్స్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ముగిసిన కొరాపుట్ పర్వ్

కొరాపుట్ లండిగుడ కళాశాల మైదానంలో సంస్కృతి పరిషత్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన కొరాపుట్ పర్వ్ ఉత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాలు ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతి, కళలకు అద్దం పట్టాయి. ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అలాగే పశ్చిమ బెంగాల్ పురిలియ, మల్కన్‌గిరి కోయ, హరియాణ ఫాగ, గుజరాత్ సింది ధమల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మంత్రి జగన్నాథ్ సరక, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్క, నవరంగపూర్ ఎంపీ రమేష్ చంద్ర మఝి, కలెక్టర్ అభిషేక్ మహ్మద్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

- జయపురం



పర్వ్ వేదికపై ఆశీనులైన అధికారులు, ప్రజాప్రతినిధులు



పర్వ్ పతకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



ఆదివాసీ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు



ఆకట్టుకుంటున్న ధింసా నృత్యం



కలహండి ఆదివాసీ సాంప్రదాయ నృత్యం

జిహ్వా చాపల్యం

- ముగిసిన కార్తీక మాసం
- కిటకిటలాడిన నాన్ వెజ్ దుకాణాలు

కార్తీక మాసం పూర్తవ్వడంతో మంగళవారం నాన్‌వెజ్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా చేపలు, చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులుతీరారు. బరంపురం నగరంలోని పెద్ద బజార్, కొమ్మాపల్లి మార్కెట్, గిరి మార్కెట్, గేట్ బజార్ తదితర జంక్షన్లలో వ్యాపారాలు జోరందుకున్నాయి. అలాగే జయపురంలో సైతం దుకాణాల్లో సందడి వాతావారణం కనిపించింది. కాగా కొనుగోలుదారులు ఒక్కసారిగా ఎగబడడంతో మాంసం, చేపలు, మటన్ రేట్లు అమాంతం పెరిగాయి. దీంతో కాస్త నిరాశ వ్యక్తం చేశారు. - బరంపురం/జయపురం



బరంపురం: కిటకిటలాడుతున్న కొమ్మాపల్లి చేపల బజార్



బరంపురం: అమ్మకానికి తీసుకొచ్చిన రొయ్యలు



బరంపురం: గేట్ బజార్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



బరంపురం: కొమ్మాపల్లిలో అమ్మకానికి పెట్టిన మటన్



బరంపురం: కొమ్మాపల్లి మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన మాంసం



జయపురం: చేపల మార్కెట్‌లో అమ్మకాలు

ముగిసిన సిట్ సమావేశం

- 3 నెలల్లో నివేదిక అందజేత
- జస్టిస్ అరిజిత్ పసాయత్

భువనేశ్వర్: నల్లధనం వెలికితీతకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) వైస్ చైర్మన్ జస్టిస్ అరిజిత్ పసాయత్ అధ్యక్షతన కటక్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశం ముగిసింది. ప్రాసిక్యూషన్, సీబీఐ, ఆదాయ పన్ను శాఖ, రెవెన్యూ ఇంటెలిజెన్స్, రాష్ట్ర క్రైమ్ శాఖ, విజిలెన్స్ విభాగం, గనుల శాఖ, వాణిజ్య శాఖ, ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ద్రవ్య సేవా పన్ను (జీఎస్టీ), నార్కోటిక్స్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. 2024 సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశంలో నల్లధనం తొలగింపు సిద్ధాంతాన్ని ఖరారు చేయనున్నారు. దీనికి సంబంధించి 3 నెలల్లో పూర్తి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 8 మధ్యంతర నివేదికలు సమర్పించారు. దేశంలో నల్లధనాన్ని అరికట్టాలంటే అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. అందువల్ల రానున్న రోజుల్లో అన్ని శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిట్‌ను ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ విభాగాలతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కృషి చేస్తుంది. గనులు, విద్యాసంస్థలు, ఇతర రంగాల్లో పెట్టుబడి పెట్టిన నల్లధనంపై సమావేశంలో చర్చించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ రాజకీయ పార్టీలు పంచిన డబ్బు, మాదక ద్రవ్యాల వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన అక్రమ సొమ్ము, రాష్ట్రంలోనూ, బయట నేరగాళ్లు వివిధ లావాదేవీల్లో వెచ్చించిన నల్లధనం వంటి పలు అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిపారు.

విజిలెన్స్ వలలో పోలీసు అధికారి



పట్టుబడిన నగదు (ఇన్‌సెట్లో) పోలీసు అధికారి సుశాంత్ కుమార్ శతపది

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ పోలీసు అధికారి సుశాంత్ కుమార్ శతపతి విజిలెన్స్ అధికారులకు చిక్కారు. ఆయన ఇళ్లు, కార్యాలయం, కటక్‌లో సోదాలు నిర్వహించి మొత్తం రూ.37.17 లక్షలకు పైగా నగదు పట్టుకున్నట్లు జయపురం విజిలెన్స్ డివిజన్ ఎస్పీ ప్రద్యుమ్న కుమార్ ద్వివేది బుధవారం వెల్లడించారు. సోమవారం ఒక ప్రైవేటు బస్సులో సుశాంత్ కుమార్ శతపతి డబ్బుతో వెళ్తున్నట్లు తమకు సమాచారం అందడంతో వెంటనే ధ్రువీకరణకు ఒక టీమ్‌ను పంపడం జరిగిందన్నారు. మరో టీమ్‌ను బొయిపరిగుడ పంపామని వెల్లడించారు.

అనంతరం జయపురానికి 5 కిలోమీటర్ల దూరంలో గల టంకువ వద్ద విజిలెన్స్ సిబ్బంది బస్సును ఆపి సుశాంత కుమార్ శతపతిని డబ్బు గురించి ప్రశ్నించగా, అతను డబ్బు తీసుకొని వెళ్లడం లేదని సమాచారం ఇచ్చారన్నారు. అయితే అతడి వద్ద నున్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో రూ.2.70 లక్షల డబ్బు పట్టుబడినట్లు తెలియజేశారు. ఆ డబ్బు ఎక్కడిదని ప్రశ్నించగా అతడు సంతృప్తికరమైన జవాబు ఇవ్వలేదన్నారు. అనంతరం బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌లోని అతడి ఆఫీసు చాంబర్‌లో మరో రూ.1.80 లక్షలు పట్టుకోవడం జరిగిందన్నారు. అలాగే బొయిపరిగుడలోని అతడి ఇంటిలో రూ.3 లక్షలు, అదేవిధంగా కటక్ బక్షీబజార్‌లోని అతడి ఇంటిలో రూ.27.77 లక్షలు లభించాయని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రద్యుమ్న కుమార్

సమితి కార్యాలయం ముట్టడి



సమితి కార్యాలయాన్ని ముట్టడిస్తున్న దృశ్యం



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

జయపురం: కొరాపుట్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సమంత ప్రధాన్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ కుంద్రా సమితి కార్యాలయాన్ని బీజేపీ శ్రేణులు మంగళవారం ముట్టడించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని, పేదలు, రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అభివృద్ధి పనుల్లో పీసీల విధానం, తమిళ ప్రభుత్వ విధానాలు అమలు చేస్తోందని దుయ్యబట్టారు. కుంద్రా సమితి ప్రజలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారని, ఒక నెల రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే సమితిలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలతో పాటు సమితి కార్యాలయానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో నవరంగపూర్ బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ రామేశ్వర జెన, జిల్లా అధ్యక్షుడు ఖగేశ్వర పూజారి, జిల్లా ఆదివాసీ మోర్చ అధ్యక్షుడు రూప భొత్ర, కోట్‌పాడ్ యువ మోర్చ మండల నాయకుడు బాలకృష్ణ మఝి, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు భగీరథి పాట్నియ, కుంద్రా బ్లాక్ మండల అధ్యక్షుడు సుందర మాలి తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో లారీ పట్టివేత

టెక్కలి రూరల్: మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు ముడిసరుకు రవాణా చేసే లారీ చోరీకి గురైన విషయం తెలిసిందే. అయితే లారీ యజమాని శిల్పశెట్టి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి 24 గంటల్లోనే బండి ఆచూకీ కనిపెట్టారు. కోటబొమ్మాళి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన సిమ్మ రాంబాబు అనే వ్యక్తి లారీని దొంగలించినట్లు గుర్తించి తన గ్రామ సమీపంలోనే లారీతో పాటు ముద్దాయిని అదుపులో తీసుకున్నట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఏనుగుల గుంపు సంచారం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి తహసీల్ పరిధిలోని కుప్పిలి గోపినాథపేట గ్రామ అటవీ ప్రాంతంలో నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు. ఇటీవల బూదర పంచాయతీ వన్నగూడ కొండ ప్రాంతంలో గజరాజుల గుంపు వరిపైరును నాశనం చేశాయి. దీంతో స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది గోపినాథపేటలో గస్తీ కాస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారి సుధీర్ కుమార్ బెహరా సూచించారు.



గోపినాథపేటలో సంచరిస్తున్న ఏనుగులు

క్లుప్తంగా

హెచ్‌ఐవీ బాధితులకు సహాయ కార్యక్రమాలు

• జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె. రాణి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా జిల్లాలోని హెచ్‌ఐవీ బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె తన చాంబర్‌లో డిసెంబర్ 1 వతేదీన నిర్వహించే కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 29 వతేదీన ట్రాన్స్‌జెండర్స్‌కు ముగ్గుల పోటీ, 30 వతేదీన క్యాండిల్ ర్యాలీ, డిసెంబర్ 1 వతేదీన ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీపీఎం బాలాజీ, సాక్షి గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యాధికారుల పోస్టులకు వాక్ ఇన్ ఇంటూర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో బుధవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నటట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు విద్యార్హత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించి తీసుకురావాలని సూచించారు.

కరాటే పోటీల్లో రాజాం విద్యార్థుల సత్తా



సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న రాజాం విద్యార్థులు

రాజాం సిటీ: ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నం పోర్టు స్టేడియంలో నిర్వహించిన ఖాటా, కుమిటతి కరాటే పోటీల్లో రాజాం విద్యార్థులు తమ సత్తా చాటారు. రాజాంలోని శివ అకాడమీకి చెందిన వై.రిషిక, కె.యంకేష్ గోల్డ్ మెడల్స్ గెలుచుకోగా, జె.నితీష్, అనీషలు సిల్వర్ మెడల్స్, హరిప్రియ, మణికంఠ, వినయ్‌లు తృతీయ బహుమతి సాధించారు. వీరికి అక్కడ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విజేతలను కోచ్ ఆర్.శివ, అనూరాధలతో పాటు పలువురు మంగళవారం అభినందించారు.

జాతీయ క్రీడాపోటీలకు కేజీబీవీ విద్యార్థిని



విద్యార్థిని యశోదను అభినందిస్తున్న ఎస్‌ఓ లక్ష్మి తదితరులు

రేగిడి: మండలంలోని దేవుదళ కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వై.యశోద జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని ఎస్‌ఓ ఎం.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. చిత్తూరు జిల్లా చౌడపల్లిలో ఈనెల 26న నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ -17 కబడ్డీ పోటీల్లో యశోద ప్రతిభచాటి, రాష్ట్రం తరపున జాతీయ పోటీలకు ఎంపికైందని, జనవరిలో జియాపూర్‌లో జాతీయపోటీలు జరగనున్నాయని పీఈటీ కె.అమ్మాజీ ఈ సందర్భంగా తెలిపారు.

హింసకు వ్యతిరేకంగా పోరాడతాం

• ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

విజయనగరం పూల్‌బాగ్: జ్యోతిరావ్ పూలే స్ఫూర్తితో హింసకు వ్యతిరేకంగా పోరాడదామని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి పిలుపునిచ్చారు. ఈనెల 25నుంచి డిసెంబర్ 10 వరకు హింసా వ్యతిరేక పక్షోత్సవాల సందర్భంగా విజయనగరం పట్టణంలో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి ప్రజాసంఘాల ఆఫీస్ వరకు ర్యాలీ జరిగింది. మహిళలపై జరిగే దాడులు, నేరాలు అరికట్టాలి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి. స్త్రీలహక్కులు కాపాడాలి. మహిళా రక్షణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి. 2024లో మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. అనంతరం జరిగిన జిల్లా సదస్సులో ప్రభావతి మాట్లాడుతూ మహిళలపై నేరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాల అమ్మకాలు జరుగుతున్నాయని, నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ సహాయకార్యదర్శి పుణ్యవతి, కృష్ణమ్మ, కుమారి, రమణమ్మ, పాల్గొన్నారు.

నీవుంటే జతగా..!

ధర్మేచ.. అర్థేచ.. కామేచ,.. మోక్షేచ.. నాతిచరామి అన్న మంత్రాన్ని వివాహకాలంలో చెప్పిన భర్త..ఆ మంత్రానికున్న అర్థాన్ని సార్థకం చేశాడు. బతుకైనా చితికైనా నీ వెంటే నా ప్రయాణం అంటూ చేసిన ప్రమాణాన్ని నిలబెట్టాడు. వివాహమైన తరువాత 50 వసంతాల పాటు ఒకరికి ఒకరై జీవించిన ఆ దంపతులు చివరికి ఒకరి వెంటే ఒకరు ప్రాణాలు విడిచి పరలోక ప్రయాణం చేశారు. – వీరఘట్టం



ఒకేచోట సమాధి అవుతున్న కిత్తయ్య, రోజమ్మ దంపతులు

• ఒకరికి ఒకరై..చివరికి ఏకమై..
• భర్త ఆరోగ్యం క్షీణించడంతో ఆగిన భార్య గుండె
• భార్య మరణవార్త తెలిసి ప్రాణం విడిచిన భర్త
• మరణంలోనూ వీడని భార్యాభర్తల పరలోక ప్రయాణం

ఐదు దశాబ్దాల క్రితం మూడుముళ్ల బంధంతో ఏడడుగులు వేసి అన్యోన్య దాంపత్యం నెరిపిన వీరఘట్టంలోని రెల్లివీధికి చెందిన బొమ్మాళి కిత్తయ్య(72), రోజమ్మ(67)దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలందరికీ పెళ్లిళ్లు కావడంతో ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. అయితే వృద్ధ దంపతులు కిత్తయ్య, రోజమ్మ మాత్రం ఎవరిపైనా ఆధారపడకుండా ఉన్నంతలో హాయిగా జీవిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కిత్తయ్య అనారోగ్యానికి గురవడంతో రోజమ్మ వీరఘట్టం మార్కెట్‌లో అరటిపండ్లు అమ్ముతూ కుటుంబ భారం మోస్తోంది. అంతే కాకుండా భర్తకు కావాల్సిన మందులు అన్నీ తానే కొని ఇస్తూ కంటికి రెప్పలా సాకుతోంది. అయితే ఒక్కసారిగా భర్త ఆరోగ్యం క్షీణించడంతో బంధువులు శ్రీకాకుళంలో జెమ్స్ ఆస్పత్రికి సోమవారం తరలించారు. భర్తను ఆస్పత్రిలో చేర్పించడంతో ఏమైపోతుందోనని ఆందోళన చెందిన రోజమ్మ రాత్రి 11 గంటల సమయంలో ఇంటిలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి తుదిశ్వాస విడిచింది. భార్య మరణవార్త తెలుసుకున్న క్షణంలోనే ఆస్పత్రిలో ఉన్న కిత్తయ్య శ్వాస ఆగిపోవడంతో ప్రాణాలు విడిచాడు.

రెల్లివీధిలో విషాదం

అన్యోన్యంగా ఉన్న కిత్తయ్య, రోజమ్మ దంపతులు మృతి చెందారనే వార్త అందరికీ తెలియడంతో బంధువులు, స్థానికులు భోరున విలపించారు.ఈ పుణ్యదంపతులను కడసారి చూసేందుకు తండోపతండాలుగా వచ్చారు. అనంతరం భార్యాభర్తలను ఒకే చోట సమాధి చేసి బంధువులు ప్రార్థన చేశారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూర్చాలంటూ శ్మశాన వాటికకు వచ్చిన వారంతా భగవంతుడిని వేడుకున్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలి

• కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, పురోభివృద్ధిపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్యతా భవనాలు, జలజీవన్ మిషన్, హౌసింగ్, గడపగడపకు మన ప్రభుత్వం పథకాలను సకాలంలో పూర్తిచేసేందుకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందని, ఆ లక్ష్యాలను అధికారులు గడువులోపల పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రాధాన్యతా భవనాలను లక్ష్యం మేరకు పూర్తిచేయక పోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నప్పటికి, భవన నిర్మాణాలు లక్ష్యాన్ని చేరుకోవడం లేదని, నిర్మాణాలు పూర్తిచేసి బిల్లుల చెల్లింపు కోసం పంపించాలని చెప్పారు. భవనాలను సంబంధిత శాఖలకు అప్పగించనంతకాలం బిల్లులు పెండింగ్ ఉంటాయని, భవనాలను పూర్తిచేసి బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

అవార్డులకు సిఫార్సు చేయండి

గర్భిణులు, బాలింతలు, బాలికలలో రక్తహీనత నివారణకు సంబంధించి రూపొందించిన ప్రణాళిక అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులను రక్తహీనత నుంచి కాపాడడంలో మెరుగైన పనితీరు కనబరిచి నందుకుగాను సీతానగరం మండలం బూర్జ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.రోహిణిని గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చే అవార్డుకు సిఫార్సు చేయాల్సిందిగా ఎంపీడీఓ కృష్ణ మహేష్ రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, పంచాయతీరాజ్ ఈఈ కృష్ణాజీ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డీపీఓ బి. సత్యనారాయణ, డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



సభలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

• శిలాఫలకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం ఫోర్ట్: విజయనగరం మండలం వేణుగోపాలపురం వద్ద సుమారు రూ.179 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన 220,132, 33 కిలోవాట్ల విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం ప్రారంభించడం శుభపరిణామమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంనుంచి వర్చువల్ విధానంలో మంగళవారం శంకుస్థాపన చేశారు. ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ఒంటితాడి అగ్రహారం విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలక్టర్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఈసబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా వివిధ రకాల విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎల్ఎన్‌రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సూర్యనారాయణరాజు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ముువ్వల లక్ష్మణరావు, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ బి. కోటీశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 7 నుంచి వాలీబాల్ పోటీలు

• విజేత జట్టుకు రూ.లక్ష బహుమతి

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలో ఉన్న శారడ ఫెర్రోఎల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కర్మాగారం ప్రతి నిధి జి.శంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు కొత్తవలస మండల పరిధి గ్రామాలకు చెందిన 18 ఏళ్లు నిండిన యువకులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు తమ జట్టు వివరాలను కర్మాగారం గేటు వద్ద డిసెంబర్ 2వ తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలో క్రీడాకారుల ఆధార్ కార్డు జెరాక్స్‌లు అందించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కొత్తవలస ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహిస్తామని, క్రీడా పరికరాలంతా కర్మాగార యాజమాన్యమే సమకూర్చుతుందని తెలిపారు. విజేత జట్టుకు రూ,లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50వేలు, తృతీయ స్థానానికి రూ.12వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేల నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 94935 49621, 94935 48330 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడా పరికరాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ: పట్టణంలో డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు(1991-96 బ్యాచ్) పాఠశాలకు వివిధ క్రీడా పరికరాలను అందజేశారు. పూర్వ విద్యార్థులు గులివిందల షణ్ముఖరావు, గేదెల రవి, తదితరులు మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం మురళీకృష్ణ, పీఈటీ రేణుక సుజాతను కలిసి వీటిని అందజేశారు. బ్యాడ్మింటన్ బాల్స్, బ్యాట్స్, షటిల్ రాకెట్స్, కాక్స్, వాలీబాల్స్, నెట్, స్కిప్పింగ్ రోప్స్, హ్యాండ్ రింగ్స్, త్రో బాల్స్, స్టేజ్ కర్టెన్స్‌తో పాటు మైక్ సెట్, ఎప్సన్ ప్రింటర్, తదితర వాటిని అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థి ఆత్మహత్య



దాసరి వెంకటదుర్గా ప్రసాద్ (ఫైల్)

రాజాం సిటీ: ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్‌లో మంచి కాలేజీలో సీటు రాలేదని మనస్తాపం చెందిన పట్టణంలో తాణావీధికి చెందిన దాసరి వెంకట దుర్గాప్రసాద్ (19) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై రాజాం టౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాణా వీధిలో నివాసముంటున్న వెంకటదుర్గాప్రసాద్ ఇటీవల ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు అప్‌లైచేసుకున్నాడు. తాను అనుకున్న కళాశాలలో సీటు లభించకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నిస్తుండగా అప్పుడే వచ్చిన తల్లిదండ్రులు గుర్తించి వెంటనే ప్రైవేట్ వాహనంలో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు భోరున విలపించారు. విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.



చౌడు గోవింద మృతదేహం

భార్య కాపురానికి రావడంలేదని..

భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురైన రాజాం మండలం ఒమ్మి గ్రామానికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ చౌడువాడ గోవింద(32) ఆత్మహత్యకు పాల్పడినట్లు రాజాం పోలీసులు వెల్లడించారు. గోవింద బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం రాజాంకు చెందిన యువతితో వివాహం జరిగింది. భార్య తనతో కాపురానికి ఒమ్మి గ్రామానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 27న కొత్తపేటలోని డీపీఎల్‌గ్రాండ్ వద్ద పురుగు మందు తాగేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న గోవిందను కుటుంబసభ్యులు శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుని తండ్రి తవుడు ఫిర్యాదు మేరకు ఎస్సై వీబీ రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

పార్వతీపురం: ఐఈఆర్‌పీలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై ఐఈఆర్‌పీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. అనంతరం గూగుల్ క్రోమ్, లెన్స్, గూగూల్ మ్యాప్, యూట్యూబ్, నోట్ ప్యాడ్, గూగుల్ షీట్స్, జీమెయిల్, మీట్, గూగూల్ లైవ్, తదితర అంశాలపై స్టేట్ ఐఈఆర్‌టీ కోఆర్డినేటర్ నర్సింహ, అబ్జర్వర్ అమ్మినాయుడు, సహిత విద్య కో ఆర్డినేటర్ భానుమూర్తి శిక్షణ ఇచ్చారు.

మానసాదేవిని దర్శించిన ఎమ్మెల్యే 'అవంతి'



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన కుమార్తెకు అమ్మవారి ఫొటోను అందజేస్తున్న ఆలయ ధర్మకర్త

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం సమీపంలో గల శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారిని భీమిలి ఎమ్మెల్యే, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ మేరకు మంగళవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె జీవీఎంసీ ఆరవ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంకలకు ఆలయ సంప్రదాయాల ప్రకారం ధర్మకర్త పిన్నింటి రమణ, శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ మానసాదేవీ నాగశక్తి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అమ్మవారి ఫొటోను ఆలయ ధర్మకర్త అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ఉత్తరాంధ్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గరివిడి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల ఏఓ జి.అనిల్‌కుమార్ ఉన్నారు.

• వైద్యవృత్తి పవిత్రం



వైద్యవిద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మలీల, తదితరులు

• ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల

విజయనగరం ఫోర్ట్: వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించే అవకాశం అందరికీ రాదని, వైద్యవృత్తిని చేపట్టడం భగవంతుడు ఇచ్చిన అదృష్టంగా భావించాలని తెలిపారు. వ్యాధితో వచ్చే వారికి ప్రేమగా, అప్యాయతతో సేవలు అందించాలని హితవు పలికారు. ఓపికతో రోగుల ఆరోగ్య సమస్య గురించి తెలుసుకోవాలన్నారు. వైద్యవిద్యను శ్రద్ధగా అభ్యసించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఎంతోమంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువుకునే అవకాశం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలాసునందిని, ప్రొఫెసర్లు డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, డాక్టర్ పీఏ.రమణి, డాక్టర్ సుదర్శి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



సవర నవతేజ (ఫైల్)

సీతంపేట: ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడిన గిరిజన విద్యార్థి సవర నవతేజ(15) శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సీతంపేట మండలంలోని అక్కన్నగూడకు చెందిన సవర నవతేజ మల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు.ఈ నెల16న తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై కోపంవలస వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మతి చెందాడని మృతుని తండ్రి సవర శ్రీను తెలిపాడు. ఈ వార్త తెలుసుకున్న పాఠశాల సిబ్బంది కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, హెచ్‌ఎం నారాయణలు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి దహన సంస్కారాల కోసం రూ.10వేల ప్రభుత్వ సహాయం అందించారు.

గుడి వద్ద యాచకుడు..

పాలకొండ రూరల్: పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడివద్ద ఓ యాచకుడు మంగళవారం మృతిచెందాడు. మండలంలోని లుంబూరు గ్రామానికి చెందిన గేదెల దుర్గారావు (55) యాచక వృత్తి చేస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యం పాలై మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

విభజన చట్టంలోని హామీల అమలు

• బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

విజయనగరం టౌన్: విభజన చట్టంలోని అన్ని హామీలను కేంద్రప్రభుత్వం నెరవేర్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తోటపాలెంలో ఉన్న ప్రైవేట్ కల్యాణ మంటపంలో పార్టీ సంస్థాగత పోలింగ్ బూత్ కమిటీలు, శక్తి కేంద్ర కమిటీలతో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీ మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీకే చెందుతుందన్నారు. ప్రభుత్వం భీమసింగి, లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించే ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని జనసేన నాయకుడు గురాన అయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రెడ్డిపావని, పార్టీ జిల్లా అధ్యక్షుడు నడికుదిటి ఈశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, అధికార ప్రతినిధి బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, అధిక సంఖ్యలో కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత వలంటీర్‌కు సహాయం



బాధితరాలి కుటుంబసభ్యులకు చెక్కు, నగదు అందజేస్తున్న సర్పంచ్ దేముడు, తదితరులు

కొత్తవలస: మండలంలోని చిన్నరావుపల్లి గ్రామ వలంటీర్ బూసాల సునీతాదేవి బోన్‌మ్యారో క్యాన్సర్‌తో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. ఆమెకు వైద్యఖర్చుల నిమిత్త విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం కొత్తకొవ్వాడ గ్రామంలోని సంస్కృతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు ఆర్థిక సహాయం చేశారు. రూ.50 వేలు చెక్కు, రూ.4వేల నగదును బాధిత వలంటీర్ కుటుంబ సభ్యులకు సోమవారం రాత్రి సర్పంచ్ బూసాల దేముడు చేతుల మీదుగా అందజేశారు. బాధితరాలి ఇద్ద రు పిల్లలకు తమ పాఠశాలలో ఉచితంగా చదువు చెప్పిస్తామని ఆ పాఠశాల ప్రతినిధులు రుద్రరా జు రామ రాజు, వి.సాయికృష్ణంరాజు హామీ ఇచ్చారు. అధ్యాపకులు నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

• డిసెంబర్ 15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీలు
• ఆసక్తి గల యువత సచివాలయాల్లో రిజిస్టర్ చేసుకోండి
• విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర వ్యాప్త క్రీడా టోర్నమెంట్ 'ఆడుదాం ఆంధ్ర'ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 15వ తేదీన సచివాలయస్థాయిలో క్రీడాపోటీలు ప్రారంభమై మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో 44 రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగుతాయని చెప్పారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నామని, 15 ఏళ్లు దాటిన వారు అర్హులను తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమపేర్లను సచివాలయాల్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు క్రీడా పరికాలు, అన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. గ్రామ స్థాయిలో గెలుపొందిన వారు మండల స్థాయికి, తర్వత నియోజకవర్గ స్థాయి పోటీలకు, అక్కడి నుంచి జిల్లాస్థాయికి అర్హత సాధిస్తారని, జిల్లా స్థాయిలో కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షు డు ఎస్.సైడిరాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ సత్యారావు, పార్టీ సీనియర్ నాయకులు మండల సురేష్,బెల్లాన త్రినాథరావు, కె.సుబ్రహ్మణ్యం, కోరాడ మోహన్‌రావు, ,కె.రాము నాయుడు,ముల్లు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.